క్లుప్తంగా

జాబ్ మేళాలో 49 మంది ఎంపిక



రౌతులపూడి జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

రౌతులపూడి: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వికాస్ ఆధ్వర్యంలో స్థానిక సూర్య డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసస్, రెప్యుటెడ్ ఫార్మా, ఇండోమిన్, ఇన్‌జీ, డీఎస్‌సీ, హోండాయ్ మొబైల్స్ తదితర కంపెనీల్లో వివిధ కేటగిరిల్లో ఉద్యోగాలకు ఇంటార్వ్యూలు జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 102 మంది హాజరుకాగా వీరిలో 49 మందిని ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి త్వరలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

గ్రామాల్లో భవానీ భక్తుల సందడి

తొండంగి: శరన్నవరాత్ర ఉత్సవాలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో భవానీ దీక్షాపరుల సందడి మొదలైంది. మండలంలోని వేమవరం, ఒంటిమామిడి, దానవాయిపేట, ముసలయ్యపేట, పెరుమాళ్లపురం, వాకదారిపేట తదితర గ్రామాలతోపాటు మెట్ట గ్రామాల్లో భక్తులు భవానీ మాలాధారణ చేపట్టారు. 41 రోజులు, 21 రోజులు, 11 రోజులు, తొమ్మిది రోజులు దీక్షాధారణ చేపట్టి నియమ నిష్టలతో దుర్గామాత పూజలు చేస్తున్నారు. ఈ పూజల వలన దురలవాట్లకు దూరం కావడంతోపాటు సత్ప్రవర్తన, ఆధ్యాత్మిక చింతన కలుగుతాయని భక్తులు చెబుతున్నారు.

ప్రతి మండలంలో గోశాల ఏర్పాటు చేయాలి

గోకవరం: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ప్రతి మండలంలో గోశాల ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో గోశాల ఏర్పాటు చేసి గోవులను పోషించే వ్యవస్థను నిర్మాణం చేయడం ద్వారా గోవుల నుంచి పాలు, పెరుగు, నెయ్యి ఉత్పత్తి అవుతాయన్నారు. అలాగే అనేక మంది దాతలు గోశాలకు ఆవులను దానం చేస్తారన్నారు. దేవదాయ భూముల్లో పశు గ్రాసాన్ని పెంచి వాటిని గోశాలకు వచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు.. దీని ద్వారా టీటీడీ లడ్డూకు అవసరమైన నెయ్యిని గోశాల నుంచే సేకరించే అవకాశం ఉంటుందన్నారు.

మృతుడి కుటుంబానికి కృష్ణుడి పరామర్శ




లాలం జమీలు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న యనమల కృష్ణుడు తదితరులు

కోటనందూరు: లోవ దేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ సోదరుడు లాలం అప్పలనాయుడు(జమీలు) ఇటీవల మృతి చెందారు. బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు కేఈ చిన్నయ్య పాలెంలో మృతుని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుని చిత్రపటం వద్ద అంజలి ఘటించి సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్లి రామచంద్రరావు, నల్లమిల్లి గోవిందు, సుర్ల రాంబాబు, చింతకాయల చినబాబు, గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, జిగటాల కోటసత్తిబాబు, ఉల్లూరి శ్రీను, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

24 మందికి కుక్కకాటు

రౌతులపూడి: మండలంలో బుధవారం కుక్కకాటుకు 24 మంది గురయ్యారు. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించారు. ములగపూడి, ఎ.మల్లవరం, బలరామపురం, ఎస్.పైడిపాల, రౌతులపూడి గ్రామాలకు చెందిన క్షతగాత్రులకు ఆసుపత్రిలోని వైద్యులు చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన పలువురిని కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పిచ్చికుక్కల బెడదను నివారించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంఈఓగా శ్యాంబాబు బాధ్యతల స్వీకరణ



శ్యాంబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పిఠాపురం: మండల విద్యా శాఖాధికారిగా జి.శ్యాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిఠాపురం బాదం మాధవరావు బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయన ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

రైతులకు కడగండ్లు



ఇ.గోకవరంలోని సుబ్బారెడ్డి సాగర్ జలాశయం



పంట పొలంలో వేసిన ఇసుక మేట

- సుబ్బారెడ్డి సాగర్ సాగునీటి కాలువలకు ఆరు గండ్లు
- 400 ఎకరాల వరి పంట నీట మునక
- 30 ఎకరాలల్లో ఇసుక మేటలు
- గండ్లు పూడ్చితేనే ఆయకట్టుకు సాగునీరు

ప్రత్తిపాడు రూరల్: పదివేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఇ.గోకవరంలోని సుబ్బారెడ్డి సాగర్ సాగునీటి కాలువలకు గండ్లు పడ్డాయి. 87 మీటర్ల గరిష్ఠ నీటి మట్టం కలిగిన ఈ జలాశయం ప్రస్తుతం పూర్తిగా నిండుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ జలాశయం కాలువలకు ఆరు గండ్లు పడ్డాయి. గతంలో చిన్నపాటి గండ్లు మూడు ఉండగా వాటిని సకాలంలో పూడ్చకపోవడంతో వర్షాలకు అవి మరింత పెద్దవిగా మారాయి. వీటితో పాటు మరో మూడు భారీ గండ్లు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా వరద నీరు పోటెత్తి పంట పొలాలను ముంచెత్తింది. సాగర్ ఆయకట్టు పరిధిలోని పెదశంకర్లపూడి, లంపకలోవ, పి.జగన్నాథపురం, ఏలూరు, ఒమ్మంగి, రాచపల్లి, టి.రాయవరం, ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద నీటి ఉధృకి ఆయకట్టు పరిధిలోని 400 ఎకరాల వరి పంట నీట నిగింది. 30 ఎకరాల వరి పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడడంతో తో ఇసుక మేటల కింద వరి పంట కూరుకుపోయి కుళ్లిపోయింది. ఇసుక మేటలను తొలగిస్తే కాని మళ్లీ సాగు చేసే పరిస్థితి లేదు. దీంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. వరదలకు ముంపునకు గురైన పంట పొలాలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అయితే మళ్లీ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడం ప్రారంభమైంది. ఈ వర్షాలకు ఇప్పటికే పడ్డ ఆరు గండ్లు మరింత పెద్దవి కావడమే కాకుండా పంట పొలాలను మంచెత్తే ప్రమాదంఉంది. మొన్నటి వర్షాలకు ముంపునకు గురైన పంటలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. మళ్లీ వరద ముంచెత్తితే పంటలు మొత్తం నష్టపోయే ప్రమాదం ఉంది. తక్షణం అధికారులు స్పందించి పడిన ఆరుగండ్లను పూడ్చి మళ్లీ నష్టం వాటిల్లకుండా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గండ్లను పూడ్చాలి

సుబ్బారెడ్డి సాగర్ జలాశయం సాగునీటి కాలువలకు పడిన గండ్లను పూడ్చివేయకపోవడంతో సాగర్ జలాలను పూర్తి స్థాయిలో విడదల చేయలేని పరిస్థితి నెలకొంది. మళ్లీ వర్షాలు కురిస్తే గండ్లు పెద్దవి కావడమే కాకుండా పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రామాదం ఉంది. మరో రెండు నెలలు మాత్రమే ఖరీఫ్ సాగు కాలం మిగిలి ఉంది. ఈ క్రమంలో గండ్లు తక్షణం పూడ్చివేసి సాగునీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు.

గండ్లు పూడ్చి సాగునీటిని అందిస్తాం



ఇటీవల కురిసిన వర్షాలకు సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు సాగు నీటి వ్యవస్థకు ఆరు గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చివేతకు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే గండ్లు పూడ్చి వేసి, సాగునీటిని అందిస్తాం.

– ఇబ్రహీం, ఏఈఈ, ఇరిగేషన్, ప్రత్తిపాడు

మళ్లీ వర్షాలు పడేలోపు..



ఇటీవల కురిసిన వర్షాలకు సుబ్బారెడ్డి సాగర్ జలాశయం కాలువలకు ఆరు గండ్లు పడ్డాయి. ఈ గండ్లు పడడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మళ్లీ వర్షాలు వచ్చేలోపు వాటిని పూడ్చాలి. ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు. గండ్లు పూడ్చకుంటే స్వరం కోల్పోతారు.

– రానంశెట్టి రాజా, రైతు సంఘ నేత, పెద్దశంకర్లపూడి

ఇసుక మేటలతో నష్టం



కాలువలకు పడిన గండ్లు పడడంతోఆయకట్టు పరిధిలోని సుమారు 30 ఎకరాలలో ఇసుక మేటలు వేసింది. దీని కింద ఉన్న పంట పూర్తిగా కుళ్లిపోయింది. ఇసుక మేటలను తక్షణం తొలగించాలి. లేకుంటే మళ్లీ సాగు చేయలేం. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలి.

– కొప్పన కోటేశ్వరరావు, ఒమ్మంగి, ప్రత్తిపాడు మండలం

వర్షంతో ఉపశమనం



కాకరాపల్లి వద్ద చెరువును తలపిస్తున్న తుని-నర్సీపట్నం రోడ్డు

కోటనందూరు: గత పది రోజులుగా వేసవిని తలపించి ఎండలకు వరిపంట ఎండిపోతున్న తరుణంలో బుధవారం కురిసిన వర్షంతో రైతులకు ఉపశమనం కలిగింది. భారీగా కురిసిన వర్షం పంటకు ఎంతో మేలు చేస్తుందని, తెగుళ్ల ప్రభావం కూడా తగ్గుతుందని రైతులు హర్షం చేస్తున్నారు. కాగా వర్ష ప్రభావానికి తుని-నర్సీపట్నం రోడ్డు చెరువును తలపించింది. అసలే గుంతల రోడ్డు ఆపై గుంతల్లో చేరిన వర్షపునీటితో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. నరకాన్ని చూపిస్తున్న తుని-నర్సీపట్నం రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరో పక్క పల్లెల్లో రహదారులు అధ్వానంగా మారాయి.

సుంకర తమ్మారావు కన్నుమూత



సుంకర తమ్మారావు

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి గ్రామానికి చెందిన రాజకీయ కురువృద్ధుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) మాజీ చైర్మన్ సుంకర తమ్మారావు(86) అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం ఆయనను కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన 1987 నుంచి నిర్విరామంగా 20 ఏళ్ల పాటు ఒమ్మంగి సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం ఆయన కుమారుడు రాజా మరో రెండేళ్లపాటు అదే సొసైటీకి చైర్మన్‌గా పనిచేశారు. మిగిలిన కాలంలో ఆయన అనుచరులు ఈ సొసైటీ చైర్మన్ బాధ్యతలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌గా కూడా పనిచేశారు. ద్వారక తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా పని చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన ఎం కృష్ణకుమారి బుధవారం కలెక్టర్ షణ్మోహన్ సగిలిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే సాధారణ బదిలీల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలో పనిచేసి, కాకినాడ డీఆర్‌ఓ కార్యాలయంలో ప్రత్యేక తహసీల్దార్‌గా నియమితులైన జీఆర్ ఠాగూరు కూడా కలెక్టర్‌ను కలుసుకుని మొక్కను అందించారు.

ఘనంగా గురువందన్.. చాత్రాభినందన్



తునిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో భారత వికాష్ పరిషత్ ఆధ్వర్యంలో గురువందన్.. చాత్రాభినందన్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది 10వ తరగతిలో ప్రథమస్థానం సాధించిన తుని మండలంలో 14 పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను బీవీపీ ప్రతినిధులు సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో బీవీపీ ముందుంటుందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. బీవీపీ గౌరవాధ్యక్షుడు ఎంవీ సూర్యనారాయణరాజు, అధ్యక్షుడు లక్ష్మణాచార్యులు, ప్రతినిధులు ఆశిన సత్యనారాయణ, చదరం శివాజీ, హెచ్‌ఎం నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడిలో ఎమ్మెల్యే పర్యటన

రౌతులపూడి: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం రౌతులపూడిలో పర్యటించారు. స్థానిక సత్యదేవ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి



ఏలేశ్వరంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: బీజేపీ వ్యవస్థపాక అధ్యక్షుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డిలోవరాజు రెడ్డిలోవరాజు ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏకాత్మ మానవాత వాద సిద్ధాంత కర్తగా, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాతగా దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధ్యాయ సిద్ధాంతాలనే స్ఫూర్తిగా పరిపాలన సాగిస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు గట్టిం వెంకటరమణ, మజ్జి జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి

జగ్గంపేట: బీజేపీ నిర్దేశకుడు జనసంఘ్ నుంచి పార్టీని ప్రజలవరకూ చేర్చిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని జగ్గంపేటలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మేడిశెట్టి వీరబాబు, ప్రధాన కార్యదర్శి పల్లా రాము, పార్టీకి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎంపీపీ పరామర్శ

గండేపల్లి: జెడ్.రాగంపేటలో మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు పాలచర్ల వెంకన్న చౌదరిని ఎంపీపీ చలగళ్ల దొరబాబు బుధవారం పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈయన వెంట వైఎస్సార్ సీపీ మండలపార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, ఒబిణ్ని వీరబాబు, తదితరులు ఉన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు



చెకుముకి ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కిర్లంపూడి: జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు ఆధ్వర్యంలో మండలంలోని పలు చెకుముకి సంబరాలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.కన్నబాబు ఆధ్వర్యంలో సోమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి ప్రశ్నా పత్రాలను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాల నుంచి జూనియర్ , సీనియర్ విభాగాలకు చెందిన సుమారు 1636 మంది విద్యార్థులు చెకుముకి ప్రతిభా పరీక్షను రాసినట్టు తెలిపారు.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అక్టోబర్ ఒకటిన మండల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.కాంతారావు, ఉపాధ్యాయులు రాంబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ముగిసిన వెబ్ సర్వీసెస్ శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వారం రోజుల పాటు అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్ పై నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసినట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఏపీ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీన్స్ తదితరులు పాల్గొన్నారు.

డేటా విసులైజేషన్ విత్ పవర్

డేటా విసులైజేషన్ విత్ పవర్ బీఐ, టేబ్లూ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం బుధవారం ప్రారంభించినట్టు డిప్యూటీ ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 4 వరకు జరుగుతుందన్నారు.

ఫార్మసీ దినోత్సవం

ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపోలో హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ సజిత్ కిషన్ గొల్లపల్లి పాల్గొని ఫార్మసిస్టుల ప్రాముఖ్యత, ఆరోగ్య సంరక్షణ రంగంలో వారి పాత్ర గురించి వివరించారు.

శిక్షణోత్సాహం.. పతకమే లక్ష్యం..

- కాకినాడలో రాష్ట్రస్థాయి హాకీ శిక్షణ శిబిరం
- ముమ్మరంగా సాధన చేస్తున్న క్రీడాకారిణులు



కాకినాడలోని హాకీ కోర్టులో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఉన్న హాకీ కోర్టులో రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఆటోలోని మెళకువలు, టెక్నిక్‌లు తెలుసుకుంటూ జోరుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. రాష్ట్ర హాకీ సంఘం సహకారంతో జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

ఈ నెల 22న ప్రారంభం

హాకీ శిక్షణా శిబిరం ఈ నెల 22న తేదీన ప్రారంభమైంది. ఈ నెల 28వ తేదీ వరకూ కొనసాగనుంది. ధర్మవరానికి చెందిన కోచ్ హసీన్, కాకినాడ జిల్లా కోచ్ రవిరాజు పర్యవేక్షణలో ఈ శిబిరంలో 16 మంది క్రీడాకారిణులు హాకీలో మెళుకువలు నేర్చుకుంటున్నారు. షూటింగ్, కాంబినేషన్ టెక్నిక్స్‌లో వీరికి శిక్షణ ఇస్తూ, స్థానిక క్రీడాకారులతో కలిసి మ్యాచ్‌లు ఆడిస్తున్నారు. వీరందరికీ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వసతి కల్పించారు. రాష్ట్ర సంఘం సహకారంతో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

30 నుంచి జాతీయ పోటీలు

జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 10 వరకూ జాతీయ స్థాయి హాకీ పోటీలు నిర్వహించనున్నారు. కాకినాడ శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆ పోటీల్లో రాష్ట్రం తరఫున తలపడతారు. కోచ్ రవిరాజు మాట్లాడుతూ ఈ నెల 28 వరకు జరిగే శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాంచీలో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

మూడోసారి నేషనల్స్‌కు అర్హత



కాకినాడ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి శిక్షణకు ఎంపికయ్యాను. మూడోసారి నేషనల్స్‌కు అర్హత సాధించాను. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాను. ఇండియాకు ఆడడం అనేది నా కల.

– భాగ్యశ్రీ, కాకినాడ జిల్లా

శిక్షణ బాగుంది



ముంబై నేషనల్స్ స్పోర్ట్స్ అకాడమీలో హాకీ శిక్షణ పొందుతున్నాను. నాలుగోసారి నేషనల్స్‌కు అర్హత సాధించాను. ఇక్కడ శిక్షణ బాగుంది. జాతీయస్థాయిలో పతకం సాధించడమే నా లక్ష్యం. అందుకు పట్టుదలతో సాధన చేస్తున్నాను.

– బి.అంకిత, కడప

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



జి.కొత్తపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ పి.గాంధీ

శంఖవరం: పత్తి సాగులో గులాబీ రంగు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని అచ్చంపేట, జి.కొత్తపల్లి గ్రామాల్లో పత్తి రైతులతో కలిసి పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట వేసిన 45 రోజుల్లో గులాబీ రంగు పురుగు పువ్వులలో పుప్పొడిని నాశనం చేయడం ద్వారా గడ్డి పువ్వులుగా మారిపోయి దిగుబడి తగ్గుతుందన్నారు. ఇలాంటి పువ్వులను తీసివేయాలన్నారు. గులాబీ రంగు పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలను అమర్చాలన్నారు. వేప కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలించాలన్నారు. ఉద్యానవన సహాయకులు క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు



అటికెవానిపాలెంలో పూలతోటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ, ఏఓలు



శృంగవరంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు



వాకపల్లిలో పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

తుని రూరల్: ఉద్యాన, అంతర పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి అన్నారు. బుధవారం తుని మండలం అటికెవానిపాలెం, మరువాడ గ్రామాల్లో ఏఓ బి.అశోక్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న హెచ్‌ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల నుంచి వాణిజ్య పంటల సాగు వైపు మళ్లాలన్నారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పూలతోటలతో పాటు అంతర పంటలు సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చన్నారు. ఈ పంటలను ప్రోత్సహించేందుకు ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు సూక్ష్మ సేద్యం పరికరాలను అమర్చుకోవాలన్నారు. సన్నా చిన్నకారు రైతులకు 90 శాతం వరకు రాయితీలు లభిస్తాయన్నారు. పత్తిలో రైతులు సూక్ష్మ పోషక యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఏఓ అశోక్ కుమార్ సూచించారు. వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

రౌతులపూడి: శృంగవరంలో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పి.ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు గాది రాజుబాబు, ఉద్యానవనశాఖ అధికారి పి.అరుణ్‌కుమార్, సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గోకవరం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి రైతులకు సూచించారు. కొత్తపల్లి, కామరాజుపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కామరాజుపేట సర్పంచ్ అడపా వెంకట్రావు, కొత్తపల్లి ఉప సర్పంచ్ కాటం రాజు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మెరుగైన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడిని సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్ తెలిపారు. మండలంలోని వెంకటనగరం, వాకపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోటనందూరు: మండలంలో భీమవరపుకోట, జగన్నాథపురం గ్రామాల్లో ఏఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో ఆధునిక యాంత్రీకరణ, సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. .

గండేపల్లి: వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి మేలైన దిగుబడి పొందాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ హరి అన్నారు. సూరంపాలెంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులుకు పలు సూచనలు చేశారు. అనంతరం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లి, ఎస్.తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు

తుని రూరల్: ఐసీడీఎస్ తుని ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న ఆరు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ కె.శ్రీలత పేర్కొన్నారు. ఖాళీల వివరాలతో నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆమె బుధవారం తెలిపారు. ఈనెల 25 నుంచి దరఖాస్తులు జారీ చేస్తామని, పూర్తి చేసిన దరఖాస్తులను తమ కార్యాలయంలో అక్టోబరు ఐదో తేదీ లోగా అందజేసి రశీదు పొందాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. 2024 జూలై ఒకటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. స్థానిక నివాసం ఉంటున్నట్టు తహసీల్దార్ జారీ చేసిన ధృవపత్రం దరఖాస్తుకు జత చేయాలన్నారు. అర్హులైన అభ్యర్థులను సెలక్షన్ కమిటీ ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అభ్యర్థుల దరఖాస్తుతో పాటు విద్య, కుల, వయస్సు, నివాస, ఆధార్ తదితర వాటిపై గెజిటెడ్ సంతకంతో ధ్రువీకరించిన నకళ్లను జత చేయాలన్నారు.

సహాయకుల ఖాళీల వివరాలు : తుని మండలం రాపాక-2 (ఓసీ-డబ్ల్యూ), తుని పట్టణం కొండవారిపేట-1 (బీసీ-ఏ), గవరపేట-3 (ఓసీ), తొండంగి మండలం పి.అగ్రహారం-1 (ఓసీ), కృష్ణాపురం-3 (బీసీ ఏ-డబ్ల్యూ), పి.ఈ.చిన్నయ్యపాలెం-1 (ఎస్సీ) ఖాళీలు ఉన్నాయన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్, వేములపాలెం , ఏలూరు-2 అంగన్‌వాడీ కేంద్రాలకు హెల్పర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. చింతలూరు వర్కర్ పోస్టు ఓసీ కేటగిరికి, వేములపాలెం హెల్పర్ పోస్టు ఓసీకి, ఏలూరు-2 హెల్పర్ పోస్టు ఎస్సీలకు కేటాయించినట్టు తెలిపారు. 21 నుంచి 35 ఏళ్ల వారు అదే గ్రామాలకు చెందిన వివాహితులు అర్హులని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, పుట్టిన తేదీ నిర్ధారణకు టీసీ జతచేయాలన్నారు. అభ్యర్థులు గెజిటెడ్ అధికారి ధృవీకరణ సంతకం చేసిన విద్యార్హత, కులం, వయస్సు, స్థానిక, ఆధార్, రేషన్ కార్డు, వితంతువులైతే భర్త మరణ ధృవీకరణ పత్రం, పిల్లలున్నట్టయితే వారి ఆధార్ కార్డులు నకళ్లను దరఖాస్తుతో జతచేయాలన్నారు. అసంపూర్తి దరఖాస్తులను తిరస్కరిస్తామని చెప్పారు. మరిన్నీ వివరాలను ప్రత్తిపాడులోని తమ కార్యాలయంలో సంప్రదించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి కోరారు.

జగ్గంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. కిర్లంపూడి మండలంలోని జగపతినగరం, జగ్గంపేట మండలంలోని రాజపూడి-2, జె.కొత్తూరు, గండేపల్లి మండలం యల్లమిల్లి-2 అంగన్‌వాడీ సెంటర్లలో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శంఖవరం: పెదమల్లాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎరకాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శంఖవరం ప్రాజెక్టు సీడీపీఓ టి.దేవి రత్నం పద్మావతి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.